# అసమర్థుడు

ఆర్. యం. చిదంబరం

శ్రీహరి ఆఫీసునుంచి ఇల్లు చేరుకునేసరికి ఆరు దాటింది. అతను ఏడాదికి నాలుగైదుసార్లు మాత్రమే వస్తాడు. మేనేజరు ఆఫీసుకు రాకపోవడం మూలాన అతను అయిదున్నరయ్యేసరికి టంచనుగా పైపు మిషను మూసేసి తతిమా గుమాస్తాలతో బయలుదేరాడు. అతన్ని చూసి అందరూ వెకిలిగా నవ్వారు

'నువ్వు వట్టి అసమర్థుడివోయ్! ఇంత ఆఫీసు ఎక్స్‌పీరియన్స్ వుంది. ఇక్కడ కాకపోతే మరోచోట రాజాలాంటి వుద్యోగం దొరుకుతుంది ఎందుకిక్కడ ఎసర్జీ వేస్టు చేసుకుంటావు? మేం నీలాగ ఎనిమిదింటిదాకా పనిచేస్తున్నామా? పెద్దముల్లు ఆరుమీద కెప్పుడువస్తుందాని ఎదురుచూస్తాంటాం.' అంటూ హితోపదేశం చేశాడువో గుమాస్తా. శ్రీహరికూడా ఆమాటల్లో అబద్ధం లేదని అంగీకరించాడు కానతనిలో వున్న లోపం ఒక్కటే-ప్రతి చిన్న విషయానికీ భయపడతాడు. మేనేజరుకూడా తన్ను లోకువకట్టి వెటిచాకిరీ చేయించుకుంటున్నాడు. ఎదిరిస్తే ఉన్న వుద్యోగం వూడుతుంది అప్పుడు ప్రతి ఆఫీసుకీ ఎక్కిదిగుతూండాలి చివరి కెప్పుడో మరో ఆధారం దొరుకుతుంది. ఈ బాధంతా ఎవరుపడతారు?

అదీ అతనితత్వం.

'ఆరింటికే ఇంటికెళ్ళి చేసిఏడిసేదేముంది? ఈ రెండు నరకాలమధ్య పడి చస్తున్నా' అనుకున్నాడు. అతని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సమస్య లెవరికీ తెలియవు.

'బహుశా ఫేనేజర్ని మెప్పించి హెడ్ గుమాస్తా కావాలనుకుంటున్నావేమో? ప్రస్తుతం వున్నవాడికి నలభై దాటాయంటే-ఇప్పట్లో రిటైరు కాడుకదా, పైనుంచి కాల్ వచ్చే అవకాశంకూడా లేదు. దుక్కలా వున్నాడు.' అంటూ హెచ్చరించాడు భవిష్యత్తులోకి తొంగిచూడగలిగిన మరో గుమాస్తా.

మెయిన్‌రోడ్డు నాలుగు దిక్కులకూ చీలిపోయేవరకూ అందరూ కలిసివచ్చారు. అందులో వొక గుమాస్తా మల్లెపూలు కొన్నాడు. వాళ్ళావిడకు అవంటే యిష్టం కావొచ్చు. మరోగుమాస్తా తనపిల్లలకని మిఠాయుండలు, పకోడీలు పొట్లం కట్టించాడు. వయం-తనకు పిల్లలేరు. శ్రీహరికూడా ఏదో కొందామనుకున్నాడు జేబులు తడుముకుంటే చిల్లికానీ తగిలింది అందుకు కారణం అతనికి జీతం తక్కువై కాదు. నూటపాతిక రూపాయలు-భార్యతప్పించి సంసారం లేదు అప్పులూ, గిప్పులూ లేవు మరోగుమాస్తా బెంగుళూరు రెయిలరింగు పకాసులోంచి కొత్త పంట్లాం తీసుకున్నాడు. శ్రీహరి తనబటలకేసి చూసుకున్నాడు. పంట్లానికి మూడు పేచీలు-చొక్కాకి రెండుమాత్రం వున్నాయి.

'ఈ డబ్బంతా ఎక్కడ పోగడుతున్నావయ్యా? మాకు తెలిసినంతవరకూ ఈవూళ్ళో ఏ బాంకులోనూ నీకు ఎకౌంటులేదే?' అనెవరైనా అడిగితే అతను సమాధానం చెప్పడు. అందతా వ్యక్తిగతవిషయం. అది మరొకళ్ళకి తెలియటం అతని కిష్టం లేదు.

ఇంటికొచ్చేసరికి అంతా హడావుడిగా వున్నారు. వదినగారు నెలరోజుల క్రితం కొన్న నిలువుటద్దంముందు నిలబడి తనపాతికేళ్ల సౌందర్యాన్ని చూసుకుని మురిసిపోతోంది. ఆమె వంటిమీది గులాబీరంగు జార్జెట్ చీర జిగేలుమంటోంది మెళ్ళో నెక్లెసు మరోవంక పోటీ పడుతోంది

అన్నయ్య టిప్‌టాప్‌గా అరుగుమీది కొచ్చాడు.

'అరె! త్వరగావచ్చేశావే?' అన్నాడు.

'సర్కస్‌కా అన్నయ్యా?' అనడిగాడు. నాలుగురోజుల క్రితం వచ్చిన సర్కసును గురించి వదిన చాలాసార్లు ప్రశంసించటం అతను విన్నాడు.

'ఛీ. అది చూసేదేవిటి? అది సరేకాని త్వరగావెళ్లి ఓరిక్షా తీసుకురా.'

శ్రీహరి భగవంతుడికో నమస్కారం పారేశాడు అతను బ్రహ్మాండమైన ప్రోగ్రాం వేసుకొచ్చాడు. ఆవేళ తన భార్యను తీసుకుని సినిమాకు వెళ్లాలని. సినిమాకు వెళ్లటం అంత గొప్ప విషయమేవిటని ఎవరైనా అడగొచ్చు. కాని శ్రీహరి దృష్టిలో అది 'ఎనిమిదో విచిత్రం' అనటంలో సాహసం లేదు. అన్నయ్య సర్కస్‌కి వెళ్తుంటే తన ప్రోగ్రాం అంతా గంగపాలయ్యేది. బహుశా షాపింగ్‌కి వెడుతున్నాడుగామోలు! రిక్షా వచ్చింది.

'మినర్వాలో కొత్త సినిమావచ్చిందోయ్ మీవదిన ఒక్కటే పోరు. ఆదివారం మేట్నీకి వెడదామంటే పనిమీరా వల్ల కాదంటుంది'

శ్రీహరికి ప్రతిఅక్షరం ఒకో పిడుగులా నెత్తిమీద పడింది

'అరె!.. నేనివాళ సరళను తీసికెడదామనుకున్నాను' అన్నాడు ధైర్యంచేసి

'దానికేం రేపు వెడుదువుకాని'

'రేపు మేనేజరు వస్తాడు ఎనిమిదయ్యేదాకా కదలనివ్వడుగా'

'అంతమాత్రంలో ఏం మునిగిపోయింది? నువ్వు వట్టిభయస్తుడివికనక ఓపూట ముందు రాలేకపోతున్నావు సెలవైనా పెట్టు. అంతగా వీలుపడకపోతే సెకండుషోకి వెళ్ళవచ్చు.

ఇదంతా శ్రీహరి హాల్లో వుండగా జరిగింది

వంటింటోకి వచ్చేసరికి సరళ పిల్లాణ్ని ఆడిస్తోంది. అతను తనపిల్లాడైతే తనూ ఎత్తుకునేవాడు. కాని అన్నయ్యకొడుకు- కొడుకుని కూడాతీసికెడితే సినిమా చూట్టం వీలుపడదని వదిన సరళకప్పగించి పోతుంది. తన ఖర్మకొద్దీ వాడు రాత్రి పదకొండుదాకా నిద్రపోడు. శ్రీహరి భార్యను పరీక్షగా చూశాడు. కట్టుకున్న సాదాచీర బాగా మాసిపోయింది. వదినవంటిమీది సిల్కుచీర మరోసారి తళుక్కుమంది. కళ్లు లోతుకుపోయాయి. పాపం - జడ వేసుకోటానిక్కూడా తీరిక లేదుగామోలు- స్టూలుమీదున్న పళ్లెంలో మల్లెపూలున్నాయి.

'సరళా! నేను పూలు తెద్దామనుకుని మర్చిపోయాను. నువ్వే కొనేశావుగా!'

'నేను కొనలేదండి. మీ వదినగారికెక్కువై వదిలేసింది' అంది నవ్వుతూ. ఆ నవ్వు వెనకాలుండే అర్థాన్ని గ్రహించుకునే శక్తి శ్రీహరికి లేదు. సరళ వృత్తి వెర్రిబాగులది. బి. సి కి చెందినదని చుట్టుప్రక్కల వున్నవాళ్లంటూరు. 'ఏవమ్మాయ్! సరళమ్మా! అన్నం అదీ పొయ్యిమీదుంచు వచ్చాక తింటాం. ఇప్పటికే ఆలస్యమైందని ఆయన కేకలేస్తున్నారు. పిల్లాణ్ణి ఆట్టే ఏడిపించకమ్మాయ్.'

సరళ సరేనన్నట్టు తలూపింది. కంగారు పడుతూ వంటచేసినట్టుంది అన్నయ్యా-వదిన సినిమాకెళ్ళారు

శ్రీహరి అన్నయ్య చదివి వదిలేసిన ఫిలిం ఫేర్ తిరగేశాడు. సరళ కాఫీ తీసుకొచ్చింది. వస్తూ గడపకి కాలుతగిలి పడిపోయింది. కాఫీ అంతా నేలపాలయింది. అతని కొకవంక కోపం, ఒకవంక జాలి కలిగాయి ఆమెను లేవదీశాడు.

'కళ్ళు తిరిగి పడిపోయానండి. చిటికలో కాఫీ కాచి తీసుకొస్తా.' అంటూ వంటింట్లో కెళ్ళింది. సీతాకోకచిలుకల్లా వున్న సినిమాతారలకేసి చూస్తూ కూర్చున్నాడు.

కాఫీ అందిస్తూ సరళ అడిగింది. 'ఏవండీ చీర కొనుక్కొస్తానన్నారు. తెచ్చారా? బొత్తిగా లేవండీ సాదా నేతచీరయినా సరే.'

శ్రీహరి మాట్లాడకుండా హాల్లోకి పోయాడు గోడవారగా కూర్చున్నాడు. ఒకవంక వుద్రేకం - మరోవంక ఏడుపూ కలిగాయి. ఛీ. ప్రతిదానికీ అన్నయ్య నడగాలి ఒకటో తారీఖున తనజీతం అన్నయ్య చేతిలో పొయ్యకపోతే అతనుకాని, వదినకాని అరక్షణం ఆలస్యంకాకుండా జ్ఞాపకంచేస్తారు. తనదాస్యం యిలా వుండగా అటు ఇంటెడు చాకిరీ సరళే చేస్తోంది. వదిన పర్యవేక్షిస్తుంది. అంతే - బోడిపెత్తనం. అన్నం వుడికివుంటే మధ్య నోసారి వచ్చి చూసి 'అన్నం వుడికిందమ్మోయ్' అంటుంది. సరళ రెండు మిరపకాయలు తీసే 'మరోటి వుండనివమ్మా ఇద్దరికీ కారం అంటే యిష్టం' అంటుంది. ఆ మాటలు వింటున్న తనుకాని అన్నయ్యకాని ఆమెకూడా సరిసమానంగా వంటపని చేస్తోందనుకోవాలి. మధ్యాన్నం కనీసం గంటయినా నిద్రపోకపోతే ఆమెను 'దిక్కుమాలిన' జ్వరం పట్టుకుంటుందట - పాపం - ఇంత విశాలప్రపంచంలో ఆ జ్వరాని కెక్కడా దిక్కులేక ఈవిడ్నే వరించాలి! మామగారు కన్యాదానం చేసి సరళను తనచేతిలో వుంచినప్పుడు సరళ నిమ్మపండులా వుండేది. ఇప్పుడు మసిబొగ్గులా వుంది.

'దీని అంతు తేల్చేయాలి' అనుకున్నాడు. ఉద్రేకంతో లేచి నిలబడ్డాడు. అతనిలా అనుకోటం ఇది మొదటిసారి కాదు

సినిమాకెళ్ళిన దంపతులు ఏడింటికి తిరిగి వచ్చారు. అంతసేపటివరకూ ఆడుకొంటూన్న పిల్లాడు అమాంతం బావురుమన్నాడు. వదిన 'మా బాయనా!' అంటూ ఎత్తుకొంది. 'అదేవిటమ్మా!.. పిల్లాణ్ణి అంతలా ఏడిపిస్తున్నావ్? .. తప్పు నాదేలే! కూడా తీసుకుపోవలసింది. అయ్యో! గుక్కతిరక్కుండా ఎట్లా ఏడుస్తున్నాడో!' అని వాపోయింది. అంతటితో వూరుకోక 'ఆ సుందరాకాండము ఆమె కట్టుకున్న సరికొత్త సిల్కు చీరమీద వారు శాస్త్రప్రయోగంలాంటిదిచేశాడు. దాంతో ఆవిడ పిల్లాణ్ణక్కడ వదిలేసి (విసిరేసి) చీర మార్చుకోటానికి పోయింది. సరళ నేలంతా శుభ్రంచేసి పిల్లాణ్ణి ఎత్తుకుంది.

శ్రీహరి పదిసార్లు రిహార్సలు వేసుకుని అన్నయ్యముందు వచ్చి నిలబడ్డాడు.

'అన్నయ్యా! నాకు అర్జంటుగా వంద రూపాయలు కావాలి.'

చదువుతున్న పుస్తకంమీదనుంచి దృష్టిని మరల్చకుండానే అన్నయ్య అడిగాడు: 'దేనికి?' శ్రీహరికి చుర్రుమంది.

'దేనికా? ..నా పెళ్ళానికీ నాకూ బట్టలు కొనుక్కోవాలి. అదీ నేనూ అడుక్కునే వాళ్ళలా తిరగటం నాకు తలవంపుగా వుంది.'

'తమ్ముడూ! నన్ను సందిగ్ధావస్థలో పడేశావు సుమా! నిజానికి నా దగ్గర ఇప్పుడు చిల్లిగవ్వకూడా లేదు. రెండురోజులు ముందుగా చెప్పివుంటే బాగుండేది అటువాయిదా చెల్లించటమైనా మానుకునేవాణ్ణి.'

'అదేవిటన్నయ్యా! ... ఎప్పుడడిగినా అలా గంటావు. నా జీతం నీ చేతిలో పోసేది నువ్వు అవసరాని కిస్తావనేకదూ! మేమిలా బికారుల్లా తిరగాల్సిందేనా?'

పరిస్థితి విషమించిందనుకున్న అన్నయ్య చదువుతున్న పుస్తకం మూశాడు.

'చూడు తమ్ముడూ!... నేను నిన్నేదో మోసంచేసి నీ డబ్బంతా నా స్వంతానికి వాడుకుంటున్నట్టు మాట్లాడుతున్నావు. నాకలాంటి అభిలాష ఎన్నడూ లేదు. మన కుటుంబపరిస్థితులు నీకు తెలుసు. చిన్నప్పుడు నాన్న పోయినా, నీకే లోటూ రానీయకుండా రాగాబంగా పెంచాను ఆఖరుకు నువ్వీవిధంగా ప్రతిఫలం ముట్టజెప్తావని అనుకోలేదు.' అన్నయ్య ముఖంమీదికి విచారపుతెరలు దింపుకున్నాడు.

శ్రీహరి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. తను ఎప్పుడు డబ్బడిగినా అన్నయ్య ఈ కథ చెప్తాడు. నాన్న దమ్మిడీ అయినా మిగల్చకుండా చనిపోయాడట. అందుకని తన్ను చదివించటానికి (స్కూలు ఫైనలు వరకు మాత్రమే!) ఎవరో అజ్ఞాతవ్యక్తిదగ్గర అప్పు

డ్యూమెక్స్
పశి పిల్లలకు శ్రేష్ఠమైన
పాలు ఆహారము

తయారుచేయుట అతి సులభం — శీఘ్ర
జీర్ణకారి, మరియు మితవ్యయము కూడాను

మీ బిడ్డలకు డ్యూమెక్స్
పాలాహారమునిచ్చి
వారు పెరుగు విధమును గమనించండి!

# ★ అసమర్థుడు ★

చేశాడట. ఇప్పటివరకూ ఆ బాకీ తీరలేదు. తను తీర్చాలి.

ఆ రాత్రి శ్రీహరికి నిద్ర పట్టలేదు. సరళ వచ్చి పడుకునేసరికి గడియారం పన్నెండు కొట్టింది. ఒంటిగంటకు కొద్దిగా కన్నులు మూతపడ్డాయి. లేచి చూసేసరికి సరళ మంచంమీద లేదు. కిటికీదగ్గర నిలబడి బయటకు చూస్తోంది. మెల్లిగా లేచివెళ్ళి ఆమె వెనకాల నిలబడ్డాడు. ఆకాశంనిర్మలంగావుంది. చందమామముఖం పాలిపోయింది. చుక్కలు ఆశాజ్యోతుల్లా మిణుకు మిణుకు మంటున్నాయి. సరళ చెక్కిళ్ళమీదుగా కన్నీటి వాహిని!

'సరళా! ఏడుస్తున్నావా?' అనడిగాడు.

పరధ్యానంలో ఉన్న సరళ ఉలిక్కిపడి కన్నీటిని దాచుకోడానికి వృథాప్రయత్నం చేస్తూ 'లేదండీ!...జలుబుచేసింది' అంటూ పొగదీసింది. ఎంత అసమర్థుడయినా శ్రీహరి ఈ మాటలు విశ్వసించలేదు.

ఆమె ఎందుకేడుస్తోందో కూడా అతను ఊహించగలడు.

'ఏడవకు సరళా!.. కష్టాలు కలకాలం ఉండవు.' అన్నాడు.

ఆ మాటకు సరళ తుంచివేసినట్టు నవ్వుతూ 'అవును...కలకాలం ఉండవు' ఒక్కసారి ముక్తివస్తుంది' అంది.

మర్నాడుదయం సరళకు బాగా జ్వరం వచ్చింది. లేవటానికి ప్రయత్నించింది కాని లాభంలేకపోయింది. వదిన విసుక్కుంటూ పొయ్యి రాజేసింది. వంటింట్లోంచి ఆమె విసురులు వినిపిస్తూనే వున్నాయి.

'చన్నీట్లో స్నానం చేయొద్దంటే ఆ మహారాణి వింటుందీ? మొన్న కుండపోతగా వర్షం పడుతున్నా లెక్కలేకుండా తిరిగింది. కొంత తనకూ తెలియాలి. ఇప్పుడందరూ నామీద విరుచుకుపడతారు.'

'అబ్బ!...ఈ మెంతులడబ్బా ఎక్కడ ఉంచిందో కదా! ఒక్కటీ వరసక్రమంలో వుండవు.'

'ఇతనేమో మంచికట్టెలు తేనూలేదు. ఆయనకు తీరికా—శ్రద్ధా వుండవు. మధ్య నాకళ్లు పోతున్నాయి. ఇంక చెయ్యా—కాలో పొయ్యిలో వుంచాలి.' పిల్లాడు ప్రొద్దున్నుంచీ ఏడుస్తూనే వున్నాడు. డజనున్నరసార్లు వీపు విమానంమోతెక్కింది కూడా. సరళ అయిదారుసార్లు లేచి నడవటానికి యత్నించింది, కాని కళ్లు చీకట్లు కమ్మాయి. కాళ్లు వణికాయి.

తొమ్మిదయ్యేసరికి శ్రీహరి వంటింటోకి తొంగిచూశాడు.

'ఇంకా వంటగాలేదు' అంది కసిరికొట్టినట్టు వదిన – మరో అరగంటవరకూ పిలుపు వస్తుందేమోనని చూశాడు. సరళైతే అతన్ని పిలిచి అన్నంపెట్టేది. అన్నం తినకుండానే ఆఫీసుకు పోయాడు.

శ్రీహరి ఇంటికి పెందలాళే వెడదామనుకున్నాడు. కాని మేనేజరు నిన్నటి పాపానికి పరిహారమన్నట్టు మరో యిన్ని ఫైల్సు అతనిముందు పడేశాడు. అయిదింటికి అన్నయ్య ఆఫీసుప్యూను పరుగెత్తుకొచ్చాడు.

'ఏమండోయ్! మీ అన్నయ్యగారు అర్జంటుగా ఇంటికి రమ్మన్నారు.'

శ్రీహరి అయోమయంగా చూస్తూ 'దేనికి?' అనడిగాడు.

'ఏమోనండి! ఇందాకనే ఆయన కూడా వెళ్ళారు. మీ యింటిదగ్గర్నుంచి ఏదో కబురువచ్చింది. అంతకంటే నాకూ ఏం తెలియదు.' శ్రీహరి మేనేజరుముందు చేతులుకట్టుకుని నిలబడి పర్మిషన్ అడిగాడు.

'దేనికయ్యా?.. ఊ... వెళ్ళు' అన్నాడు.

అతను వెళ్ళేసరికి ఇల్లంతా గొల్లుమంటోంది. అతన్ని చూడగానే నలుగురూ నాలుగుమాటలూ విసిరారు.

'ఎందుకూ మొగుడు? అప్రయోజకుడైన తరవాత.'

'అయినా ఆవిడేవిటమ్మా! పూర్వకాలంమనిషిలా! అసలు పూర్వకాలం వాళ్ళుకూడా అలావుండరు'

'అదలావుంచి ఈముండ కెంతపొగరు! రాక్షసిముండ! అది కోడలే! తనూ కోడలే! దానివుసురు తగలకుండా వుంటుందీ!'

శ్రీహరి ఇంట్లో అడుగుపెట్టాడు. ముందు కనిపించింది సరళశవం. అన్నయ్య అతన్ని కౌగలించుకుని ఏడ్చాడు. వదిన కూడా అతన్ని చూడగానే ఆలాపనస్థాయి హెచ్చించింది. కొంతసేపయ్యాక జరిగింది తెలిసింది.

'అదేమో మధ్యాన్నం నిద్రపోతూందట– సరళ ఎప్పుడువెళ్ళిందో యేమో! నూతి




దగ్గర కెళ్ళింది. కాలుజారి పడిపోయింది గాబోలు! ఆసంగతి నలుగురికీ తెలిసొచ్చే సరికి ఆలస్యమైంది. డాక్టరు వచ్చి చూశాడు. ఏంచేస్తాడు? అసలు నూతిదగ్గర కెందుకెళ్ళింది?'

శ్రీహరి పక్కగదిలోకి పోయాడు. కిటికీ దగ్గర సరళ నిలబడ్డచోట నిలబడ్డాడు. జుత్తు పీక్కున్నాడు. తల గోడకేసి బాదుకున్నాడు... సరళ కాలుజారి పడటం అబద్ధం! తనే పురికేసివుంటుంది! నిన్న నే అంది-కష్టాలకు ఒక్కసారి విముక్తి వస్తుందని - ఈ బాధలు - ఎత్తిపొడుపులూ - కలిమివుండీ దారిద్ర్యం, అసమర్థుడైన భర్త అమాయకత్వం భరించలేకపోయింది. తనే సరళ చావుకు కారకుడు! వదినను అన్నయ్యను ఎందుకు వృధాగా నిందించటం? దాని కడసారికోరిక - ఒక్కచీర కొనివ్వలేకపోయాడు తను. వంటలక్క కయినా స్వాతంత్ర్యం - సుఖం వుంటుంది.

పిచ్చిగా పెట్టెలోంచి ఓఫోటో తీశాడు. అది సరళ పెళ్ళినాటిఫోటో. ఎంత అందంగా వుంది! పెదవులమీద అమాయకమైన చిరునవ్వు! జీవితాని కదిచాలు!

'మాయింటో మల్లెమొక్క వుందండి. రోజా తెగపూస్తుంది. అవంటే నాకు ప్రాణం. మీరుకూడా రోజా మల్లెపూలు తెస్తారుకదూ!'

సరళతోబాటు తనుకూడా పోతే బాగుండును! కాని ఆమెను బాధపెట్టినందుకు ప్రతిఫలం అనుభవించొద్దూ?

తనజీతమంతా వదినగారి సింగారానికి పోరతి కర్పూరం!

పావలా దొరికితే చాన్తో పెళ్ళాన్ని సుఖపెట్టే రిక్షావాడు తనకంటె నయం!

'అంతచాకిరీ నేను చేస్తున్నానుకదా! ఈవిడెందుకు నూతిదగ్గర కెళ్ళిందమ్మోయ్' అంటోంది వదిన.

అన్నయ్య అతన్ని ఓదార్చాడు.

'మంచి పిల్ల. అమాయకురాలు. వంద రూపాయలు తీసుకొచ్చానుసుమా!...ప్చ్...ఎందుకూ! నీరుపోయాక ఆనకట్ట!'

* * *

మూడునెలలకాలం బరువుగా గడిచింది. శ్రీహరి మరీ మందమతిగా తయారయ్యాడు. అతనిప్పుడు పదింటికివచ్చినా బాధలేదు. అతనికోసం ఏడ్చేవా రెవరూ లేరు. అతని అనురాగంకోసం పాకులాడేవారూ లేరు. తోబుట్టువయిన అన్నయ్యదగ్గర్నుంచి, ఆఫీసుప్యూనుదాకా అతన్నెవరూ మనిషి కింద గౌరవించరు. జీతంరాగానే అన్నయ్య చేతిలో వుంచాడు. అతను వద్దంటూనే పుచ్చుకున్నాడు. బట్టలు కుట్టించలేదు. ఇంకెవరికోసం? గోచీ పెట్టుకున్నా అడిగే వాడు లేడు.

SISTA'S • AML • 32 TEL

"మీరు కూడా మీ బట్టలకు టినోపాల్ ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది"



తెల్లని బట్టలు ప్రకాశించేలా తెల్లబడేటట్లు చేయాలంటే, దానికి సరియైన మార్గం "టినోపాల్", కొద్దిగా టినోపాల్, ఒక్కసారి ఉపయోగించితే మూడు నాలుగు ఉతుకులవరకూ చాలుతుంది.

టినోపాల్ ఉపయోగించిన తెల్లని బట్టలు అన్నిటికన్నా తెల్లనైనవి.

టినోపాల్

"టినోపాల్" జె. ఆర్. గాయిగి యస్. ఏ. బాల్, స్విట్జర్లాండ్ వారి ట్రేడ్‌మార్కు.

షురీద్ గైగీ ట్రేడింగ్ ప్రయివేట్ లిమిటెడ్.

పోస్ట్ బాక్సు • 965 – బొంబాయి.

# అసమర్థుడు

ఓనాడు అన్నయ్య పిడుగులాంటివార్త మోసుకొచ్చాడు.

'తమ్ముడూ! ఎంతకాలం యిలా ఒంటరిగా వుంటావు? నీకేమో వయస్సు ముప్పై కూడా కాలేదు. పోయిన సరళను తల్చుకుని ఎంతకాలం ఏడుస్తూ కూర్చుంటావు? నీబాధ యిలావున్నా ముందు నేను చూడకలేక పోతున్నాను. నిన్న నీకో సంబంధం వచ్చింది. నువ్వు సరేనంటే ఈ నెల్లోనే పెళ్ళి కానిచ్చేద్దాం. ఇలాంటి అవకాశం మళ్ళీ రాదు. అమ్మాయిగురించి నాకంతగా తెలియక పోయినా వాళ్ళనాన్నను తెలుసు. చాలా మెమ్మదస్తుడు. నా సలహా విను.'

ఇదివరకటి సంబంధం కూడా అన్నయ్యే కుదిర్చాడు. పల్లెత్తుమాటనకుండా చాకిరీచేసే సరళను తీసుకొచ్చాడు. అన్నయ్యకు దూర దృష్టి ఎక్కువని వప్పుకోవాలి అందుకే కోపంవచ్చి పుట్టింటికి పోతాననకుండా డబ్బులేని మామగార్ని ఎంచుకొచ్చాడు. శ్రీహరికూడా ఒంటరిబతుకు భారంగానే వుంది. సరేనన్నాడు.

పెళ్ళి సామాన్యంగానే జరిగిపోయింది. అమ్మాయి కాపరానికూడా వచ్చింది. వచ్చిన రెండు రోజుల్లోనే ఇరుగు పొరుగువారితో చెలిమిచేసుకుంది. నలుగురూ ఆమెకు సరళ జీవితాన్ని పలవలు చిలవలుగా వర్ణించి చెప్పారు.

ఆదివారం రాగానే ఆ అమ్మాయి సినిమాకు వెళ్లాలంది. ఆనాడే అన్నయ్య వదిన వెడదామనుకున్నారు.

'అందరం కలిసే వెడదాం...పిల్లాడికోసం నే నింటో కూచోవాలా యేం? నావల్ల కాదు.' ఈ మాటలు విన్న వదిన ముక్కుమీద వేలేసుకుంది. అవేళ పిల్లాడు సినిమా హాలంతా స్వైరవిహారంచేసి సినిమా చూడ నివ్వలేదు. శ్రీహరికొత్తపెళ్ళాం మాత్రం తనకేం పట్టనట్లు సినిమాతో ఐక్యమైపోయింది. ఇదంతా చూస్తున్న శ్రీహరికి మాత్రం ప్రళయం దగ్గరపడిందన్న భయం పట్టుకుంది.

మరో రెండు రోజులు గడిచాక శ్రీహరి ఆఫీసునుంచి వచ్చేసరికి అన్నయ్య చిర్రుబుర్రులాడుతూ - ఆ చిన్న హాల్లో అటూ యిటూ నడుస్తూ వాకింగ్ ఎక్సర్‌సైజ్ చేస్తున్నాడు. అతన్ని చూడగానే చరచర ముందుకు వచ్చాడు.

'ఇదుగో! నీ పెళ్ళాం వచ్చి పట్టుమని పది రోజులైనా కాలేదు. అప్పుడే దాన్తో కయ్యం పెట్టుకుంది. సరళ ఇలాగే వుండేదా? మీ వదినమాత్రం ఒకరిచేత పల్లెత్తుమాట పడే రకం కాదుసుమా!' అనరిచాడు.

శ్రీహరి తన భార్యను పిలిచి సంజాయిషీ అడుగుదామనుకుంటుంటే ఆవిడే వచ్చింది.

'ఏమండోయ్! నేనిప్పుడే చెప్పేస్తున్నా. ఈ యింటో అందరూ సమానులే! ఎక్కువ తక్కువలేవు. ఇంటెడు చాకిరీ నే నొక్కర్తెనే చేయటానికి నేనేమైనా వంటలక్కననుకున్నారా? వందరూపాయ లివ్వండి- అది కూడా చేయదు. ఆవిడ మాత్రం మహారాణిలా కూర్చోవాలి? అది నావల్ల కాదు. మీ చిత్తంవచ్చినట్టు ఆడించటానికి నేను సరళను కాను. అది వెర్రిబాగులదికనక కుక్కిన పేనులా వూరుకుని చివరికి ప్రాణం తీసుకుంది. నే నంత తెలివితక్కువదాన్ని కాదు...మరోమాట—మధ్యాన్నం కనీసం రెండుగంటలైనా నిద్రపోకపోతే జ్వరం వస్తుంది. వారానికో సినిమా చూడకపోతే మతిపోతుంది!

అందరూ నోరు తెరిచి చూస్తున్నారు. ఇలాంటి "రాక్షసి"ని కోరి తెచ్చుకున్నందుకు అన్నయ్య చెంపలు వాయించుకున్నాడు.

'చూస్తావేరా ఆడదానిలా!—మెడపట్టి గెంటక—గయ్యాళిదాన్ని. ఎంతపొగరు!' అని గద్దించాడు అన్నయ్య.

'ఏమండోయ్! మీరు వయసులో పెద్దలే కావొచ్చు. కాని అనవసరంగా మాటలు విసరకండి మీరెవరు నన్ను గెంటటానికి?' అనింకా ఏదో అనబోతుంటే శ్రీహరి 'నోరు ముయ్' అనరచి చెంపమీద ఛెళ్ళుమని కొట్టాడు.

కందిపోయిన బుగ్గల్ని ఓ చేత్తో తడుముకుంటూ 'నోరు మూసుకునుండటానికి నేను సరళననే అనుకుంటున్నారు కదూ!... నేనిప్పుడే పుట్టింటికి పోతున్నా.' అంటూ సామానుసర్దటం మొదలెట్టింది. శ్రీహరి కేం తోచలేదు.

'ఎలాగో ఏడవండి' అంటూ బయట కొచ్చాడు.

ఇతరులకి సలహాలివ్వటానికి సంసారాలు సరిదిద్దటానికి-పూనుకున్న నలుగురైదుగురు ఇరుగుపొరుగువాళ్లు అతన్ని పిలిచి ముందు జరగవలసినదాన్ని గురించి హితోపదేశం చేశారు.

తత్ఫలితంగా వారంరోజులు గడిచాక శ్రీహరి వేరేకాపరం పెట్టాడు. ఒకటోతారీఖున వచ్చిన జీతమంతా భార్యచేతిలో పోస్తున్నాడు. కాని నలుగురూ అతన్ని అసమర్థుడనే అంటున్నారు.

'ఆడుదానికి పెండ్లామెవ్వరు'? అంటూ పోగుమాస్తా యక్షప్రశ్న వేస్తాడు.

'అప్రయోజకుడైన మగడు' అంటూ శ్రీహరివంక చూస్తూ మరోగుమాస్తా సమాధానం చెప్తాడు. కాని ఆమాటలకు శ్రీహరి అంతగా బాధపడటంలేదు. ఇదివరకు అన్నకు వదినకూ దాసుడు-ఇప్పుడు భార్యకుదాసుడు. గట్టిగా మందలిస్తే 'ఈ బెదిరింపులకు భయపడడానికి నేనిదివరకటి అమ్మాయిని కాదండోయ్!' అంటుంది ఛెళ్లున. పొద్దున్న వంటపనికూడా మూడువంతులు అతనే చేస్తున్నాడు.

అయితే నేం!

లోకం ఇప్పుడుకూడా అతన్ని 'అసమర్థు' డనే అంటోంది. కాని-అతని అసమర్థతకు ఇదివరకు చూపిన కారణం వేరు, ఇప్పుడు చూపుతున్న కారణం వేరు.

★


## తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD)

రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును, ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు జ్ఞాపకశక్తిని కంటిచూపును వృద్ధిచేయును, కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5-0-0 3 సీసాలు రు.12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు 6-0-0 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.)



## వైటోడెంట్

దంతక్రిములను సంహరించే పండ్లపొడి

శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్. మద్రాసు-30.






## నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము, శుక్లాక, విస్పత్తువ వగైరా హరించి. బలము రక్తవృద్ధికల్గించును 20 తు. డబ్బీ రు 3-4-0 పోస్టేజి రు.1-1-0.

వి సి ఎ అండ్ కో, (ఆయుర్వేద వమాజం)
పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా.